ఓం నమో భగవతే శ్రీ రమణాయ



# రమణ భాస్కర



వ్యవస్థాపక సంపాదకులు : బి.వి.ఎల్.ఎన్.రాజు

సంపుటి : 19 | సంచిక : 04 | డిసెంబర్ 2013

రమణ భాస్కర
ఆధ్యాత్మిక మాస పత్రిక

పేజీలు : 12

గౌరవ సంపాదకులు
శ్రీమతి P.H.V. సత్యవతి (హైమ)

చందా
సంవత్సర చందా:రు|| 150/-
విడి ప్రతి : రు|| 15/-

చిరునామా
రమణ భాస్కర
శ్రీ రమణ క్షేత్రం,
జిన్నూరు – 534 265
ప||గో|| జిల్లా, ఆం||ప్ర||

పబ్లిషర్
సద్గురు శ్రీ నాన్నగారు
శ్రీ రమణ క్షేత్రం
జిన్నూరు – 534 265
☎ 08814 - 224747
9247104551

ఈ సంచికలో....

జిన్నూరు
17-11-2013

ప్రింటర్
శ్రీ భవాని ఆఫ్‌సెట్ ప్రింటర్స్
(దుడే శ్రీను) ఎస్.వి.ఆర్. కాంప్లెక్స్,
పాలకొల్లు, 9848716747

## (సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహభాషణములు, జిన్నూరు – 17-11-2013)

ప్రియమైన ఆత్మబంధువుల్లారా,

ఈ రోజు అరుణాచల దీపోత్సవం. జిన్నూరు గ్రామంలో దీపోత్సవం చేస్తామని మేము ఎప్పుడూ అనుకోలేదు. అలా జరగవలసి ఉంది, జరుగుతోంది. అనుకొనేది మన సంకల్పం, జరిగేది ఈశ్వర సంకల్పం. ఎక్కడ ఏది జరుగుతున్నా అది ఈశ్వరసంకల్పం అనుకొంటే మనం దుఃఖానికి, అశాంతికి దూరమవుతాము. పంచభూతాలకు పంచలింగాలు ఉన్నాయి. అందులో అరుణాచలం అగ్నిలింగం. ఈ రోజున అరుణాచలం శిఖరం మీద దీపాన్ని ప్రజ్వలన చేస్తారు. అరుణాచలం గురించి ఋగ్వేదంలోను, స్కాంధపురాణంలోను, శివపురాణంలోను ఉంది. నేను గొప్ప అంటే నేను గొప్ప అని బ్రహ్మదేవుడికి, విష్ణుదేవుడికి వచ్చిన పేచీ తీర్చటానికి ఈ రోజున ఈశ్వరుడు జ్యోతిరూపంలో దర్శనం ఇచ్చాడు. ఆ జ్యోతి యొక్క ఆది, అంతం ఎవరైతే చూసి వస్తారో వారే అధికులని చెపితే యిద్దరూ చూడలేకపోయారు. బ్రహ్మవిష్ణువుల యొక్క అహంకారం అణచటానికి ఈరోజున పరమేశ్వరుడు జ్యోతిరూపంలో దర్శనం యిచ్చాడు కాబట్టి దానికి గుర్తుగా అరుణాచలం కొండమీద ఈరోజు సాయంత్రం 6 గంటలకు జ్యోతి ప్రజ్వలన చేస్తారు. దీపం చీకటిని పోగొడుతుంది, వెలుతురును యిస్తుంది. అది దీపం చేసే పని. మనం దేహబుద్ధిని పోగొట్టుకోవాలి, ఆత్మబుద్ధిని సంపాదించుకోవాలి. మనం అరుణాచలంలో ఉన్నా, జిన్నూరులో ఉన్నా ఎక్కడ ఉన్నా మనం చేయవలసింది ఏమిటి అంటే మనలో ఉన్న అజ్ఞానాన్ని పోగొట్టుకోవాలి. అజ్ఞానం ఎలా పోతుంది అంటే జ్ఞానాన్ని సంపాదిస్తే అజ్ఞానం పోతుంది. అది దీపోత్సవం యొక్క గుర్తు. ఈరోజున భక్తులు గిరికి ప్రదక్షిణం చేస్తారు. ఆ ప్రదక్షిణం

చేసేటప్పుడే రమణాశ్రమం వస్తుంది. గిరిచుట్టూ చాలా దేవాలయాలు ఉన్నాయి. ఈ కార్తీక పౌర్ణమి రోజునే కాదు, ప్రతీ పౌర్ణమికి గిరి చుట్టూ ప్రదక్షణ చేయటానికి ఈ మధ్య భక్తులు అలవాటు పడ్డారు. పౌర్ణమి రోజున అరుణగిరికి ప్రదక్షణ చేస్తే మంచిదని ఓ ప్రచారం జరిగింది. అందుచేత ప్రతీ పౌర్ణమిరోజున కూడా హద్దులు లేకుండా జనం ప్రదక్షణ చేస్తున్నారు.

భగవాన్ శ్రీరమణమహర్షి ఈ అరుణాచలానికి ఆకర్షింపబడ్డారు. ఆయనంతట ఆయన స్వచ్ఛందంగా ఇక్కడకు రాలేదు. ఈశ్వరసంకల్పాన్ని బట్టి ఆయన అరుణాచలం రావలసి ఉంది, వచ్చారు. మన ఋషులు చాలా కష్టపడి విపరీతమైన సాధనలు చేసి అమృతానుభవం పొందినట్లు మన పురాణాలలో ఉంది. అందరూ యిలా వస్తే ఆయన ఇలా రాలేదు, అలా వచ్చారు. సర్వేశ్వరుడే ఆయన హృదయంలోనుండి ఆత్మరూపంలో ప్రత్యక్షమై ఆత్మానుభవం కలుగజేసాడు. మన హృదయంలో సద్వస్తువు ఉంది అని ఆయనకు తెలియదు. దేహబుద్ధిని పోగొట్టుకొని ఆత్మబుద్ధిని పొందాలి అనేటటువంటి తలంపుకూడా ఆయనకులేదు. ఆయన పురాణాలు, వేదాలు చదువుకోలేదు. ఆయన మధురై హైస్కూలులో పదవ తరగతి వరకూ చదువుకున్నారు. నా చదువు ఏపాటిది, పదవ తరగతితో ముగిసిపోయింది కదా అని ఒక ప్లీడర్‌గారితో భగవాన్ అన్నారు. ఆ ప్లీడర్‌గారు ఏమన్నారంటే మీ చదువు అలా ముగిసిపోవటం వలననే మాకు ఒక మహాయోగి దొరికాడు. మీరు పెద్ద చదువులు చదివి ఉద్యోగం చేస్తే మాకు దొరకకపోదురు కదా! మీరు పదవ తరగతితో ముగించేయటం మా అదృష్టం అన్నారు. భగవాన్ ఏమన్నారంటే నా చదువు ఏపాటిది. నేను భగవద్గీత గురించి, ఉపనిషత్‌ల గురించి మాట్లాడుతున్నాను అంటే అవి చదువుకోవటం వలన కాదు, శ్రవణం చేయటం వలన అన్నారు. మా దగ్గరకు పండితులు వస్తూ ఉంటారు, వారు మాట్లాడుతూ ఉంటే శ్రవణం చేయటం వలన, వారు శ్లోకం చదివేటప్పటికి అర్థం స్ఫురించేది. వేదాలలో ఏ వస్తువునైతే తెలుసుకోమని ప్రతిపాదించారో ఆ వస్తువు తానయి ఉన్నాడు అప్పటికే. అందుచేత వారు ఆ శ్లోకం చదివేటప్పటికి లోపల ఉన్న వస్తువు ఆయనకు స్ఫురించేది. ఏదైతే మనం పొందామో అదే వేదాలలో వర్ణింపబడి ఉంది అని అనుభవైకవేద్యం అయ్యింది. అందుచేత ఆయన సాధనలు చేసి తెలుసుకొని పొందింది కాదు, అది ఈశ్వరుని ప్రసాదం, ఈశ్వరుని అనుగ్రహం. భౌతికంగా మీరు ఇక్కడ భోజనాలు చేసిఉండవచ్చు. తరువాత ఇక్కడ మీకు ప్రసాదాల వినియోగం ఉంది. మీరు సబ్జక్టును శ్రవణం చేయాలి. అది మీ చెవులద్వారా మీ మెదడు లోనికి వెళ్ళే ప్రసాదం. ఒక్క వాక్యం మీ జీవితాలలో మార్పు తీసుకొని రావచ్చు, ఇదే నిజమైన ప్రసాదం. వాక్యం దేవుడై ఉన్నది. వాక్యం కూడా అనుగ్రహమై ఉన్నది. అందుచేత మీరు శ్రద్ధగా శ్రవణం చేయాలి.

భగవాన్ మనకు ఇచ్చిన ప్రసాదం ఏమిటి అంటే నేను ఎవడను అనే ప్రశ్న. ఇప్పుడు

మనం అనుకొనే నేను మిథ్య నేను, అసత్యమైన నేను. ఈ నేను అనేక విషయాల గురించి ఆలోచిస్తోంది. రాబోయే జన్మల గురించి పుణ్యపాపాల గురించి, లాభనష్టాల గురించి ఇలా అనేక రకాలుగా ఆలోచిస్తోంది. ఈ నేను ఎంత అసత్యమో అది ఆలోచించే విషయాలు, ఊహించే విషయాలు కూడా అంతే అసత్యం. పరబ్రహ్మస్థితిలో ఈ నేను కల్పించే విషయాలు ఏమీ లేవు. ప్రపంచంలో ఏ వస్తువులోను సుఖంలేదు, శాంతిలేదు. యింద్రియాల ద్వారా విషయాలు అనుభవించినప్పడు బాహ్యంగా నీకు ఏదైనా సుఖం వచ్చినా పరిణామంలో అది దుఃఖంగా మారిపోతుంది. ప్రపంచంలో ఎక్కడా సుఖంలేదు. సుఖం, శాంతి నీ హృదయంలోనే ఉన్నాయి. మనం నేను, నేను అంటున్నాము కదా. ఇది కూడా ఒక తలంపే. దానికి అనేక తలంపులు వస్తూ ఉంటాయి. నేను అనే తలంపును మిగిలిన తలంపులనుండి విడదీసి దానిని పట్టుకొని దాని మూలంలోనికి పంపితే, హృదయంలో నిలబెడితే అది అక్కడ కరిగిపోతుంది, అప్పడు అక్కడ ఉన్న పరమాత్మ నీకు వ్యక్తమవుతాడు. అదే ఎరుక. దాని గురించి శ్రవణం చేయాలి. మూడుఅవస్థలలోను ఈ ఎరుక ఉంది, అది ఎప్పడైతే మీకు అనుభవంలోనికి వచ్చిందో అదే కడసారి జన్మ, ఇంక మీరు శవాలను మోయనక్కరలేదు.

ప్రారబ్దాన్ని అనుభవించే తీరవలెను అని అందరూ చెపుతున్నారు కదా అది ఎంతవరకు నిజం, ఇంక పరమేశ్వరుడి మీద భక్తి ఎందుకు అని భగవాన్‌ను అడిగారు. ఆయన ఏమన్నారు అంటే ఈశ్వరుడిపట్ల భక్తి వలన, ప్రేమవలన, విశ్వాసంవలన మీ ప్రారబ్ధం యొక్క వేగం తగ్గుతుంది. దైవాన్ని ప్రార్థించటం వలన మీకు ఎంతో కొంత ఉపకారం ఉంటుంది అన్నారు. భారతయుద్ధంలో అర్జునుడికి, కర్ణుడికి యుద్ధం జరిగేటప్పడు కర్ణుడు అర్జునుడిని చంపటానికి ఒక ఆయుధాన్ని విడిచిపెట్టాడు. ఆ ఆయుధం ఎవరిమీద అయితే విడిచిపెట్టాడో వాడు మరణించాలి. అది చట్టం. కాని అక్కడ డ్రైవర్ ఎవరు అంటే పరమాత్మ. ఆయన కూడా చట్టాన్ని గౌరవించాలి. ఆయుధం వచ్చేటప్పడు కృష్ణుడు రథాన్ని కిందకు తొక్కేసాడు. అప్పడు ఆయుధం వచ్చి, అర్జునుడి కిరీటాన్ని పట్టుకొనిపోయింది. అంటే పీకపోవలసింది, కిరీటం పోయి ఆగిపోయింది. అది భగవంతుడి అనుగ్రహం. ఈమధ్యన తిరుచునాపల్లి నుండి ఒక ప్లీడరుగారు నా దగ్గరకు వచ్చారు. రాధకు, కృష్ణుడికి ఉన్న సంబంధం ఏమిటి అని అడిగారు. రాధ జీవుడు, కృష్ణుడు దేవుడు. రాధ కృష్ణుడిని ఎలా ప్రేమించిందో అలా మనం కూడా కృష్ణుడిని ప్రేమించగలిగితే పరమాత్మ యొక్క స్వరూపం మనకు దొరుకుతుంది. అయితే అక్కడ భౌతికమైన సంబంధం లేదు. అది అభౌతికం, అలౌకికం. అక్కడ బాహ్యమైన విషయాలతోటి, యింద్రియాలతోటి, దేహంతోటి ఏమి సంబంధం లేదు. ఆ ఆప్యాయత, ప్రేమ అభౌతికం. మీరు ఊహిస్తే అది తెలియదు. అది అనుభవైకవేద్యం. అదే రాధాకృష్ణుల ప్రేమ. అది మెటీరియల్ కాదు, అది పూర్తిగా స్పిరిట్యువల్. అట్టి ప్రేమను మనం సంపాదిస్తే

మనకు కూడా పరమాత్మ లభ్యమవుతాడని చెప్పటంకోసం రాధాకృష్ణుల ప్రేమను చెపుతారు అని చెప్పాను. అంతకుముందు అరుణాచలానికి ఎంత ఖ్యాతి ఉన్నప్పటికీ భగవాన్ అరుణాచలం వచ్చిన తరువాత అంతర్జాతీయంగా అరుణాచలం ఖ్యాతి పొందింది. భగవాన్ తల్లిగారు వచ్చి ఇంటికి వెళ్ళిపోదాము రమ్మని అడిగితే ఆయన ఏమని చెప్పారు అంటే నా అంతట నేను యిక్కడకు రాలేదు. నా దేహం యొక్క ప్రారబ్ధాన్ని అనుసరించి అరుణాచలేశ్వరుడే ఇక్కడకు తీసుకొని వచ్చాడు. ఈ క్షేత్రాన్ని కేంద్రంగా పెట్టుకొని ఈ దేహం పని చేయవలసి ఉంది. అందుచేత జరుగవలసింది ఏదో జరుగుతుంది, జరుగరానిది ఎవరు ఎంత ప్రయత్నం చేసినా జరుగదు అని చెప్పారు. నాకు JK గారిమాట జ్ఞాపకం వస్తూ ఉంటుంది. JK గారు ఏమన్నారు అంటే నేను సుఖపడటానికి, శాంతిగా ఉండటానికి కారణం మీకు తెలుసా? వాట్ ఈజ్ ది సీక్రెట్ ఆఫ్ మై హేపీనెస్? ఐ డోంట్ కేర్ వాట్ హేపెన్స్. దట్ ఈజ్ ద సీక్రెట్ ఆఫ్ మై హేపీనెస్. మన డ్యూటీ ఏదో మనం చేస్తాము. జరిగేది ఏదో జరుగుతుంది, జరగనిది ఏదో జరగదు. వాటిని నేను ఏమీ పట్టించుకోను.

ఒకసారి గణపతిశాస్త్రిగారు ఏమన్నారు అంటే సైకిలు ముందుకు తొక్కటం తేలికే, వెనక్కి వెళ్ళటం కష్టం. అలాగే ముందుకు పరిగెట్టటం తేలిక, వెనక్కి పరిగెత్తటం కష్టం. దేవ లోకంలోనికి వెళ్ళి యింద్రుడు ఏమి చేస్తున్నాడో చూసి రమ్మంటే చూసివచ్చి మీకు చెపుతాను కాని ఈ నేను అనే తలంపును లోపలకు పంపమంటే చాలా కష్టంగా ఉంది స్వామీ అని భగవాన్‌తో అన్నారు. అది సరి, అది సరి అని భగవాన్ అన్నారు. కాని సత్యాన్వేషణలో ఆయన దయ ఉంటే ఈ నేను అనే తలంపు దాని మూలంలోనికి వెళ్ళి, అక్కడ నిలబడి కరిగిపోతుంది. బాహ్యముఖంగా విజృంభిస్తున్న మనస్సును అంతర్ముఖం చేయాలంటే అది ఈశ్వరుని దయలేకుండా జరుగదు. నిప్పు ముట్టుకుంటే కాలాలి, అలా కాలకపోతే అది నిప్పు కాదు. అలాగే మీరు అందరూ నిజంగా చదువుకొని ఉంటే, మీరు విద్యావంతులు అయిన మాట నిజమైతే మీకు వినయం కలగాలి. విద్యలోనుండి వినయం రావాలి. విద్య ఒక్కటే సంపదకాదు, దాని వలన వినయం వస్తే అదే నిజమైన సంపద. మన మనస్సులో కాని, ముఖంలోగాని అవినయం లేకుండా ఉంటే, కేవలం వినయమే సంపదగా ఉన్నవారికి మాత్రమే ఆత్మజ్ఞానం కలుగుతుంది.

మీరు ఇంటి దగ్గర పనులు చేసుకొంటున్నారు, మీరు శాంతిగా ఉంటున్నారా? దీనికి ఆచార్యులవారు చెప్పేది ఏమిటి అంటే మనం ఇంటి దగ్గర చేసుకొనే పనుల వలన మనకు శాంతి కలగాలి. కాని మనం ఎటువంటి పనులు చేస్తున్నాము అంటే వాటివలన నాతోటి నేను శాంతిగా ఉంటున్నానా అంటే లేను, పోనీ ఇంటిలో వారితో శాంతిగా ఉన్నానా అంటే లేను, సమాజంతోటి శాంతిగా ఉన్నానా అంటే లేను ఆరకంగా పనులు చేస్తున్నాము.

భగవంతుడు కర్మయోగం గురించి చెప్పాడు. భగవంతుడు కర్మను ఎలా చేయమని చెప్పాడో ఆరకంగా మనం చేస్తే నాతోటి నేను శాంతిగా ఉంటాను. ఎంతశాంతి అంటే అది ముగింపు లేని శాంతి. దానికి దేహంతోటి, మనస్సుతోటి, లోకంతోటి పనిలేదు. అది స్వతంత్ర్యంగా ఉంటుంది. అప్పుడు నాతోటి నేను శాంతిగా ఉంటాను, మీతోటి శాంతిగా ఉండగలను, సమాజంతో శాంతిగా ఉండగలను. భగవంతుడు శాస్త్రంలో ఏరకంగా పనిచెయ్యమని చెప్పాడో ఆరకంగా మనం పని చెయ్యటంలేదు అందువలననే మనకు అశాంతి కలుగుతోంది. మనం మాట్లాడితే అహంకారం కేంద్రం, పనిచేస్తే అహంకారం కేంద్రం, మన చేష్టలు అన్నీ అహంకారమే. ఇలా అహంకారాన్ని కేంద్రంగా పెట్టుకొని, దుర్బుద్ధిని దురాచారాన్ని కేంద్రంగా పెట్టుకొని నువ్వు పనిచేస్తూ ఉంటే నీకు శాంతి ఎలా కలుగుతుంది. భగవంతుడు గీతలో చెప్పిన కర్మయోగాన్ని అనుసరించి నువ్వు పని చేస్తూ ఉంటే నువ్వు సుఖంగా ఉంటావు, శాంతిగా ఉంటావు, కుటుంబసభ్యులు శాంతిగా ఉంటారు, సమాజం శాంతిగా ఉంటుంది. అంతేగాని తింగరతనంగా పనిచేయకూడదు, శాస్త్రాన్ని అనుసరించి పనిచెయ్యాలి, ఇది ఆచార్యులవారి బోధ.

భగవాన్ అరుణాచలక్షేత్రానికి ఆకర్షింపబడ్డారు. ఆయన అరుణాచలంలో 54 సంవత్సరాలు ఉన్నారు. ఆయన మహర్షి అని, మహాజ్ఞాని అని, అవతారపురుషుడు అని గుర్తించటం చాలా కష్టం. ఎందుచేతనంటే ఆయన మనతోపాటు, మనలో ఒక్కడిలాగే ఉంటాడు, అందుచేత గుర్తించటం కష్టం. ఆయన జీవితంలో పెద్ద సఫరింగ్ ఏమీ కనబడదు. పరమేశ్వరుడి అనుగ్రహం వలన మరణానుభవం ద్వారా పరమేశ్వరుడి స్వరూపాన్ని పొందాడు. ఏదైతే తన హృదయంలో ఉందో అది స్వరూపంగా వ్యక్తమయ్యింది. దేహం ఉండగానే దేహంలేని స్థితిని పొందాడు, అదే అమృతానుభవం. వాడిని యమధర్మరాజు కూడా ఏమి చేయలేడు. దేహం ఉంటే చంపుతాడు, దేహబుద్ధిలేనివాడిని యమధర్మరాజు వచ్చినా ఏమీ చేయలేడు. దేహం చనిపోయినప్పుడు నేను చనిపోతున్నాను అనివాడు అనుకోడు. దేహం ఉండగానే దేహం అనే జడవస్తువుతో కురిడీకొబ్బరికాయలాగ విడిపోయి ఉంటాడు. ఏవో మాటలు చెప్పటంకాదు. మిమ్మల్ని అమృతానుభవానికి తీసుకొనివెళ్ళాలి. నా దగ్గర అరటిపండు ఉంటే అది మీకివ్వటం తేలిక, మీ చేతిలో అరటిపండు ఉంటే నాకివ్వటం తేలికే. కాని మనలో ఉన్న గుణాలు పోవాలి. లోపల ఉన్న సద్వస్తువును తెలుసుకోవటానికి, బ్రాహ్మీస్థితిని పొందటానికి మనలో ఉన్న ఏ గుణాలు అయితే అడ్డువస్తున్నాయో వాటిని త్యాగం చేయటం కష్టం, గురువు అనుగ్రహం లేకుండా అది సాధ్యంకాదు.

మీకు జ్ఞానంకలగకుండా మీ లోపల ఉన్న ఏ గుణాలు అడ్డువస్తున్నాయో ఆ గుణాలు మీకు తెలియటం లేదా? ఆ గుణాలు పోవాలంటే థింక్ ఆఫ్ అరుణాచలా, థింక్ ఆఫ్

రమణ, థింక్ ఆఫ్ కృష్ణా, థింక్ ఆఫ్ రామా బైడే అండ్ బైనైట్. అలా చేయటం వలన ఆ గుణాలు పోతాయి. భక్తి లేకుండా, శ్రద్ధ లేకుండా అది ఎలా సాధ్యం. మనకు ఈశ్వరుని యందు భక్తి లేదు, ప్రేమలేదు. మేము తెలివైన వాళ్లము, మేము ఏదో సాధన చేస్తున్నాము అంటే మీ సాధనలవలన, మీ తెలివితేటలవలన, మీ స్నానాలవలన, మీ పుణ్యాలవలన జ్ఞానం వచ్చేస్తుంది అని మీరు అనుకొంటే అది చాలా పొరపాటు. మనం ఎంతటివారము, మన సాధన ఎంత? అసలు వచ్చేగాలి అంతా అటునుంచి రావాలి, ఈశ్వరానుగ్రహం రావాలి. మేము ఏదో సాధన చేస్తున్నాము అంటే చేయండి, ప్రయత్నం చేయండి, మంచిదే కాని దానివల్లే అంతా వచ్చేస్తుంది అని మీరు అనుకోవద్దు. ఈశ్వరుని దయలేకుండా మనం ఆయన స్వరూపాన్ని పొందలేము, అది సాధ్యంకాదు.

మీకు అందరికీ ఉండాలని ఉంది. ఎలా ఉండాలని ఉంది? సుఖంగా ఉండాలి, శాంతిగా ఉండాలి, ఏ కష్టం రాకూడదు అనుకొంటారు. మీరు అలా ఉండవచ్చు, ఎప్పుడు అంటే అందరి హృదయాలలో అంతర్యామిగా ఉన్నాను అని ఈశ్వరుడు చెపుతున్నాడు కదా. అంతర్యామిగా ఉన్న ఈశ్వరుని పాదాల దగ్గరకు మనం చేరుకొంటే మనం సుఖంగా ఉ ండవచ్చు, శాంతిగా ఉండవచ్చు. అది దేహగతమైనది కాదు, మనోగతమైనది కాదు, యింద్రియగతమైనదికాదు. ఇవి అన్నీ జడవస్తువులే. అది ముగింపులేని ఆనందం, ముగింపులేని శాంతి. ఏ శాస్త్రం చదివినా, నీ సుఖానికి, శాంతికి మనస్సే అడ్డువస్తోంది, అందుచేత మనస్సును నాశనం చేయమని చెపుతున్నారు. అది ఎలా చెయ్యాలి అని ఒక ప్లీడరుగారు భగవాన్‌ను అడిగారు. అసలు మనస్సు అంటూ ఉంటే దానిని నాశనం చెయ్యవచ్చు, అది లేదు కదా అన్నారు భగవాన్. అది రమణతత్వం. ధ్యానం చేసుకోండి, జపం చేసుకోండి అని చెపుతున్నారుకదా అని అడిగితే మీరు ఉంది అనుకొంటున్నారు కాబట్టి చేసుకోమంటున్నాను, మీరు అడుగుతున్నారు కాబట్టి చేసుకోమంటున్నాను కాని మీకు పనిగట్టుకొని చెప్పటం లేదుకదా. ఏమిటి గడ్డపారలు, కత్తులు వేసుకొని వెళతాము అంటారు. అక్కడ ఏదైనా ఉంటే కదా చంపటానికి? అక్కడ ఏమీ లేదు. ఆయన చెప్పింది యదార్థం. ఆ స్థితిని అందుకోలేకపోతున్నాము. ఆయన అనుగ్రహం ఉంటే కాని అది సాధ్యం కాదు. గణపతిశాస్త్రిగారికే అది సాధ్యంకాలేదు. అయితే గణపతిశాస్త్రిగారికి సాధ్యంకాలేదని మీకు సాధ్యంకాదు అనుకోవద్దు. మీకు అందరికీ సాధ్యం అవుతుంది, మీరు అమృతానుభవం పొందుతారు. అది పొందిన తరువాత తెలుస్తుంది అందులో ఉన్న విశేషం. అక్కడ దుఃఖస్పర్శ ఉండదు, వ్యక్తిభావన ఉండదు.

యిండివిడ్యువల్ ఎగ్జిస్టెన్స్ ఈజ్ ది సోర్స్ ఆఫ్ ఆల్ సారోస్ అని బుద్ధుడు చెప్పాడు. నేను ఫలానా వ్యక్తిని అని అనుకోవటంలోనే నీకు అశాంతి ప్రారంభమవుతుంది. మీరు ఎన్ని

పూజలు చేసినా జపాలు చేసినా ఫలానా పేరునాది, ఫలానా కులం నాది, నేను ఫలానా రోజున పుట్టాను అని యిలాగ మీకు వ్యక్తిభావన ఉన్నంతకాలం మనస్సు, బుద్ధి, యింద్రియాలు మిమ్మల్ని విడిచిపెట్టవు. మీరు భగవంతుని విడిచిపెట్టేస్తారు కాని మిమ్మల్ని మీరు ఎలాగ విడిచిపెట్టు కొంటారు. మనం ఏదయితే నేను నేను అంటున్నామో ఆ నేను నిజం అనుకొన్నంతకాలం మీరు మాయను అతిక్రమించలేరు. భగవంతుడి దయ లేకుండా ఈ వ్యక్తిభావనను జయించటం కష్టం. బుద్ధుడు సారనాధ్ విడిచిపెట్టి వెళ్ళిపోయేటప్పుడు ఆ దారిలో రోడ్డు ప్రక్కన ఒక కుష్టువాడు కూర్చొని ఏడుస్తున్నాడు. వాడికి ఏవో ఇబ్బందులు ఉన్నాయి ఏడుస్తున్నాడు. బుద్ధుడు ఆ కుష్టువాడితో చెపుతాడు మైఫ్రెండ్ వాట్ మేక్స్ యు వీఫ్. దేరీజ్ నో సారో, దేరీజ్ నో టెన్షన్, దేరీజ్ నో అన్‌రెస్ట్. యు కమ్ ఎలాంగ్ విత్‌మి, ఐ విల్ షో యు ది వే. నీకు ఏదైనా దుఃఖం ఉంటే, అశాంతి ఉంటే దానిలోనుండి వెంటనే బయటపడే మార్గం నీకు చూపిస్తాను, నువ్వు నాతో రా, నిన్ను నిర్వాణస్థితికి మోసుకొని పోతాను. ఎక్కడయితే చావులు లేవో, ఎక్కడయితే పుట్టుకలు లేవో, ఎక్కడయితే దుఃఖం లేదో, ఎక్కడయితే అశాంతి లేదో అక్కడకి నిన్ను మోసుకొని పోతాను. యు కమ్ ఎలాంగ్ విత్ మి, ఐ విల్ షో యు ద వే. యివ్వటం అంటే యివ్వటమే.

దేహప్రారబ్ధాన్ని బట్టి లాభనష్టాలు వస్తూ ఉంటాయి, సంతోషం వస్తూఉంటుంది, దుఃఖం వస్తూఉంటుంది. నువ్వు ఊహించని సంఘటనలు జరుగుతూఉంటాయి. వచ్చేది ఏదో వస్తూఉంటుంది, పోయేది ఏదో పోతూఉంటుంది. నువ్వు ఊహించనది వచ్చిందంటే పొంగిపోకు, ఒకవేళ ఉన్నది పోయినా కుంగిపోకు. నువ్వు శాంతచిత్తాన్ని విడిచిపెట్టవద్దు. శాంతచిత్తం కలవాడికంటే అదృష్టవంతుడు ఈ లోకంలో ఎవడు ఉన్నాడు. నాటకాల్లో రాముడు, రావణాసురుడు వేషాలు వేస్తూఉంటారు. రాముడి వేషం వేసినవాడు రావణాసురుడితో యుద్ధం చేస్తాడు కాని ఆ రావణాసురుడి మీద వాడికి ద్వేషం ఏమీ ఉండదు. ఇది అంతా అబద్ధం అని నాటకం వేసేవాడికి తెలుసు. అలాగే ఈ ప్రపంచం అనే స్టేజీ మీదకు నటించటానికి నువ్వువచ్చేసావు. రాకపోతే ఏ గొడవ లేదు తీరా ఈ భూమిమీదకు వచ్చేసావు. అందుచేత ఇక్కడ ఎలా నటించాలో తెలుసుకొని అంటే యిష్టాలు, అయిష్టాలు, సుఖాలు, దుఃఖాలు ఇవి ఏమీ లేకుండా వీటిని విడిచిపెట్టి ఈ భూమి మీద నీ పాత్రను నిర్వర్తించి నీ వాసనలు, అలవాట్లు తగ్గించుకొని ఈ ప్రపంచం అనే స్టేజీ మీద నుండి బయటకు వెళ్ళిపో. ఈ భూమిమీదకు వచ్చేసాము, ఏదో రోజు వెళ్ళిపోవటం తప్పదు. నాటకంలో యాక్టరును ఎంతసేపు కూర్చోబెడతారు, యాక్షన్ అయిపోయిన తరువాత దింపేస్తారు. అలాగే ఈ భూమిమీదకు వచ్చిన పని అయిపోయిన వెంటనే మనలను కూడా పొమ్మంటారు. ఎప్పుడూ మనమే ఉంటే ఇంక కొత్తవారికి అవకాశం ఏది. ఈ ప్రపంచం

అనే స్టేజీ మీదకు తీరా వచ్చేసారు కాబట్టి నటించి రాగద్వేషాలను తగ్గించుకొని మీ దారిని మీరు వెళ్ళిపొండి.

మీరు ప్రశాంతమైన మనస్సును కనుక సంపాదిస్తే శాంతచిత్తం నీకు చేసే ఉపకారం నీ తల్లిదండ్రులు చేయగలరా, మీ కుటుంబసభ్యులు చేయగలరా, మీ బాంక్‌లో ఉన్న రూపాయలు, ఆస్థులు చేయగలవా? ఎవరూ చేయలేరు. మీ శరీరం మరణించాక మీకూడా మీ మనస్సువస్తుంది కాని ఎవరూ రారు. మరణానంతరం నీకూడా వచ్చే మనస్సును కంట్రోలు చేసుకో, ఆ మనస్సుతో మంచి పనులు చెయ్యి, మనస్సులోనికి మంచిఆలోచనలు వచ్చేలా చూసుకో. ఒకవేళ నువ్వు చేస్తున్న సత్కర్మకు ఎవరూ సంతోషించక పోయినా, యింట్లోవారు పొమ్మంటున్నా, వల్లకాడు రమ్మంటున్నా, నువ్వు మరణానంతరం ఇతరలోకాలకు వెళ్ళినప్పడు నువ్వు చేసిన సత్కర్మలు ఎదురువచ్చి నీకు స్వాగతం పలుకుతాయి. ఈ లోకం నిన్ను గుర్తించకపోయినా పరమేశ్వరుడు గుర్తిస్తాడు. బాహ్యంగా నీకు ఎంత డబ్బు ఉంది, నువ్వు ఎంత చదువుకున్నావు, నీకు ఎన్ని కార్లు ఉన్నాయి, ఎంత ఆస్థి ఉంది అనే దానిని బట్టి కాదు నీకు విలువ, లోపల నువ్వు ఎలా ఉన్నావు అనేది ముఖ్యం. కొంతమంది ఎక్కువగా నిద్రపోతూ ఉంటారు, అదొక రకమైన పాపం. నిద్రలో ఎవరికి భయం లేదు. జాగ్రదవస్థలో భయాన్ని ఎదుర్కొనే పరిస్థితులు వచ్చినప్పడు నువ్వు భయం లేకుండా ఉండగలగాలి. అప్పడు భయాన్ని జయిస్తావు. ఎప్పడైతే భయం పోయిందో అప్పడు దుఃఖం వేరుతో సహా నశిస్తుంది.

ఉన్నది ఒక్కటే అని మీరు చెపుతున్నారు. ఆ వస్తువుమీద దేవుడు, జీవుడు, లోకం అన్నీ కల్పించబడ్డాయి అంటున్నారు. కొంతమంది ఏమో దేవుడు వేరు, జీవుడు వేరు, లోకం వేరు అంటున్నారు. ఉన్నది ఒక్కటే అంటే వాళ్ళు మిమ్మల్ని తిడుతున్నారు అని ఆచార్యులవారితో చెపితే తిడితే తిట్టనివ్వండి, నా సిద్ధాంతం వారికి నచ్చకపోతే నన్ను తిట్టనివ్వండి. కాని ఎవరైతే తిడుతున్నారో వారి హృదయంలో ఉన్న నిజమైన ఆత్మని నేనేకదా. అంటే దాని అర్థం వాళ్ళని వాళ్ళే తిట్టుకొంటున్నారు. వాట్ ఎ బ్యూటిఫుల్ ఎక్స్‌ప్రెషన్. చెవులున్నవారందరూ విని ఆనందించండి. సరస్వతీదేవి కటాక్షం లేకపోతే ఈ సమాధానాలు చెప్పలేరు. నువ్వు నా పట్ల భక్తిని సంపాదించు. అది లాభంకాదు అనుకొంటున్నావేమో అదీ లాభమే. లోకంలో నీకు ఏదైనా లాభాలు కలిగినా అవన్నీ టెంపరరీ, నాయందు నీకు భక్తి కలిగితే అది టెంపరరీ కాదు, అది పెర్మనెంట్ లాభం. అప్పడు నా ప్రసాదం నీకు దొరుకుతుంది. నా అనుగ్రహం, నా ప్రసాదం కనుక మీకు ఉంటే మీ మనస్సు అణగటమే కాదు, మీకు శాంతి కలగటమే కాదు, రాకపోకలతో సంబంధం లేని శాశ్వతస్థానాన్ని పొందుతారు, అదే మోక్షం, అదే నిర్వాణస్థితి.

పిరికివాళ్ళు రోజూ చనిపోతూఉంటారు. కాని కుటుంబంలో ఎన్ని గొడవలు వచ్చినా, సమాజపరంగా ఎన్ని ఇబ్బందులు వచ్చినా ధైర్యవంతుడు ఒకేసారి చనిపోతాడు. అటువంటి ధైర్యాన్ని సంపాదించండి అని పరమాత్మ చెపుతున్నాడు. రమణమహర్షిగారు ఇటువంటి గొడవలలోనికి రారు. ధైర్యం ఎవరికి? ఏకాగ్రత ఎవరికి? ఇదంతా మనస్సుకే. అసలు అది ఉంటే కదా అంటారు. నిన్ను నువ్వు తెలుసుకొన్నాక అసలు మనస్సు అనేది లేదని నీకు తెలుస్తుంది. ఈ ధైర్యం, కృతజ్ఞత, మంచిపనులు చేయటం ఇవన్నీ ఎక్కడ ఉన్నాయి,మనస్సులో ఉన్నాయి. దేరీజ్ నో మైండ్ టు కంట్రోల్ యిఫ్ ది ట్రూత్ ఈజ్ రీలైజ్‌డ్. ఇదే భగవాన్ రిపీటెడ్‌గా చెప్పారు. ఇప్పుడు మనస్సు ఉంది, దానిని ఎలా జయించాలి అని నువ్వు అనుకొంటున్నావు. బట్ యిఫ్ ద ట్రూత్ ఈజ్ రీలైజ్‌డ్ దేరీజ్ నో మైండ్ టు కంట్రోల్. ఈ చిన్న వాక్యాన్ని, అందమైన వాక్యాన్ని నోట్ చేసుకోండి. డిజైర్ నేచర్ ఈజ్ నాట్ యువర్ సెల్ఫ్. ధైర్యం కలిగి ఉండమని పరమాత్మ చెపుతున్నాడు. వ్యాపారం చేసే వాడికి ధనం ఎలాగ పెట్టుబడో అలాగ నువ్వు ఏదైనా పని చెయ్యాలన్నా, ఆధ్యాత్మికంగా అభివృద్ధిలోనికి రావాలన్నా ఎంతోకొంత ధైర్యం ఉండాలి. సాధకుడికి ధైర్యం అవసరం. భగవాన్ ఏమంటారంటే రెండు ఉంటే ధైర్యం. ఉన్నది ఒక్కటే అయితే ధైర్యం ఏమిటి? ఈ రాజ్యాన్ని, కుటుంబసభ్యులను విడిచిపెట్టి ఎందుకు అలా వెళ్ళిపోతున్నావు అని బుద్ధుడిని అడిగితే అప్పుడు బుద్ధుడు ఏమన్నాడంటే నాలో ఉన్న శాంతిని, నాలో ఉన్న ఆప్యాయతను, నాలో ఉన్న జ్ఞానాన్ని, నాలో ఉన్న సుఖాన్ని ఈ కుటుంబసభ్యులకేనా పంచిపెట్టటం? యింక ఎవరికి పంచిపెట్టవద్దు అంటున్నావా, ఇక్కడకే పరిమితం చేయమంటున్నావా చెన్నా? నా సుఖం, శాంతిలో ఎవరికీ వాటా పెట్టవద్దు అంటావా? ఇక్కడికే ఆపుచేయమంటావా చెన్నా? మరి మీరందరూ దీనికి వాటాదారులు కాదా అన్నాడు.

కొంతమంది ఎంతసేపు లోకం గొడవలతో ఉంటారు. ఈ మధ్య చాలామంది తిండికి, బట్టకు ఎక్కువ ఖర్చు చేస్తున్నారు. పూర్వంకంటే ఇప్పుడు ఎక్కువ తిండి తినేస్తున్నారు. టెక్నాలజీ వచ్చి రకరకాల బట్టలు తయారు చేస్తున్నారు. పూర్వం ఇంత ఖరీదైన బట్టలు లేవుకదా. మీరు సంపాదించిన డబ్బు అంతా తిండికి, బట్టలకు ఖర్చు అయిపోతోంది. యిదంతా టెక్నాలజీ. దీని వలన కొంత చెడ్డ వస్తోంది. మీరు చాలా ఖరీదైన బట్టలు తొడుగుతారు అనుకోండి, ఖరీదైన తిండి తింటున్నారు అనుకోండి. మీకు తెలియకుండానే మీ మైండ్ పొల్యూట్ అయిపోతుంది. దీనివలన దేహవాసన, లోకవాసన పెరిగిపోతూ ఉంటుంది, అందుకు చెపుతున్నాను ఈ మధ్యన ఒక రాజుగారు ఆయన భార్యతో ఏమన్నారు అంటే నువ్వు నేను చనిపోయాక వచ్చే జన్మలో కూడా నువ్వే నాకు భార్యగా ఉండాలి అని చెప్పాడు. ఆ భార్య ఏమంటోందంటే సంతోషించాము లెండి యింక పెళ్ళాంగా ఉండటమే

పనా, ఇంక భక్తి గొడవ, జ్ఞానం గొడవ ఏమీ లేదా అంటోంది. భర్త అంటే ఆ అమ్మాయికి ఇష్టమే కాని ఈ సబ్జక్టు విని ఉంటుంది. వచ్చే జన్మలోకూడా పెళ్లంగా ఉండటమే పనా. నేను మిమ్మల్ని చూస్తూ ఉండాలి, మీరు నన్ను చూస్తూఉండాలి. ఇలా చూసుకోవటమే పనా? ఇంకో పనిలేదా? నో, నో అంటోంది. ఎంతసేపు ఈ శవాల గొడవేనా? ఉన్నత విలువలు ఉన్నాయి కదా, వాటిని పొందాలి కదా అంటోంది.

ఎప్పడూ జనంలో కలిసిపోకుండా కొంత ఏకాంతంగా ఉండండి. ఏకాంతంగా ఉన్నప్పడు మీ మనస్సులో ఏమి జరుగుతోందో మీకు తెలుస్తూఉంటుంది. ఏ అలవాట్ల వలన, ఏ కారణాల వలన మనకు రాబోయే జన్మలు సిద్ధంగా ఉన్నాయో ఏకాంతవాసంలో ఉన్నప్పడు మనకు తెలుస్తుంది కాని పదిమందిలో ఉన్నప్పడు తెలియదు. వీటిని నెమ్మదిగా తగ్గించుకోవటానికి ప్రయత్నం చెయ్యాలి. రుచిగా ఉందని ఎక్కువగా తినేయవద్దు. కొంచం తినేటప్పటికి సరిపోతుంది అని మీ దేహం చెపుతుంది. అప్పడు ఆపేయండి. పాపం సంపాదించినా, పుణ్యం సంపాదించినా శరీరం, మాట, మనస్సే. ఈ మూడింటిని జాగ్రత్తగా నియమించుకోండి. మీకు ఏదైవం అంటే యిష్టమో ఆ మూర్తిని ధ్యానించుకోండి. ఆయన నామాన్ని జపించుకోండి. అదికూడా యిష్టంగా చేయాలి. మీరు దేనినైతే పొందాలి అనుకొంటున్నారో ఆ వస్తువు మీద మీకు ప్రేమ ఉండాలి, దానిని పొందాలి అనే తపన ఉండాలి. ఇవన్నీ మీ హృదయంలోనుండి రావాలి. ఏమండీ ఇవన్నీ మాకు వస్తాయా, ఎలాగ వస్తాయండీ అంటే ఈశ్వరుని మీద ప్రేమ వలన, భక్తివలన, సత్పురుషులతో సహవాసం వలన ఇవన్నీ మీకు వస్తాయి. యివన్నీ సాధ్యమే.

జపం చేసుకోండి, ధ్యానం చేసుకోండి అని చెపుతూ ఇదంతా మీ మనోకల్పితమే కదా అంటారు భగవాన్. జపం చేస్తూ, ధ్యానం చేస్తూ మీ మనస్సు చుట్టూ తిరుగుతున్నారు కాని మైండ్‌ను ఓవర్‌కమ్ చేయటంలేదు. జపాలు ధ్యానాలు చేయవద్దు అనటంలేదు. వీటివలన మీ మనస్సు అంతర్ముఖం అవుతోందా అది చూసుకోండి. మీరు జపం చేస్తున్నారు, ధ్యానం చేస్తున్నారు, మంచిదే. రవ్వంత, ముల్లంతైనా మీ మనస్సు లోపలకు దిగుతోందా? అది చూసుకోండి. అసలు చెయవద్దు అనటంలేదు. మందులు వాడేటప్పడు రోగం తగ్గుతోందా లేదా అని చూసుకొంటాము కదా అలాగే మీరు చేసే సాధనలవలన మనస్సు అంతర్ముఖం అవుతోందా, లేదా అని చూసుకోండి. అభ్యాసం, వైరాగ్యం ఇవి రెండూ విడిచిపెట్టవద్దు. వ్యక్తిభావన విడిచిపెట్టాలి. కొంతమందికి అధికారం వలన, అహంకారం వలన బలం వస్తుంది, దానిని విడిచిపెట్టండి. మీరు మాట్లాడేటప్పడు రీజన్ ఉండాలి. రీజన్ లేకుండా మాట్లాడుతూ ఉంటే, హేతుబద్ధంగా మాట్లాడకపోతే అది మొండి పట్టుదల, అది పనికిరాదు. అహంకారంలో నుండే గర్వం వస్తుంది, వికారాలు వస్తాయి. ఒక మనిషికి

గర్వం వస్తూ ఉంటే వాడు తప్పనిసరిగా పతనమవుతాడు.

బుద్ధుడి పినతల్లి పేరు గౌతమ్. బుద్ధుడితల్లి చనిపోతే పినతల్లి వాడిని పెంచింది. పినతల్లి పేరు నాకు వచ్చేసింది ఏమిటి అని బుద్ధుడు అనుకోలేదు. బుద్ధుడు ఏమన్నాడంటే నన్ను ఎంతబాగా పెంచావు అంటే నీ కడుపున పుట్టిన బిడ్డను కూడా అలా పెంచవు. నన్ను అలా పెంచావు అందుచేత నీ పేరు నాకు వచ్చేసింది అది న్యాయమే అన్నాడు. గౌతముడు అనే పేరు ఎవరో పెట్టింది కాదు ఆయన పినతల్లి పేరు. ఆయన అమృతానుభవం పొందాక బుద్ధుడు అయ్యాడు, అదే గౌతమబుద్ధ. నదులు వచ్చి సముద్రంలో కలుస్తాయి. ఆ నదులు వచ్చి నాలో కలవాలి అని సముద్రం అనుకోదు. అనుకోకపోయినా అవి వచ్చి సముద్రంలో పడిపోతాయి. అలాగే నీ దేహప్రారబ్ధంలో ఏదైతే ఉందో అది నీ కోరికతో సంబంధం లేకుండా వచ్చేది వచ్చేస్తుంది. నీ ప్రారబ్ధంలో లేనప్పుడు నువ్వు కోరుకొన్నా అది రాదు. అందుచేత కోరిక అనవసరం. పైగా కోరిక వలన దుఃఖం వస్తుంది, పునర్జన్మ వస్తుంది. నాకు పునర్జన్మ ఉందా అని బుద్ధుడిని అడిగేవారు. నీకు దేహం అవసరమైతే పుడతావు, దేహం అవసరం లేదు అనుకొంటే ఇంక పుట్టవు. మీకు అయినా అంతే. మరల పుడతామా అని మీరు ఎవరిని అడగవద్దు. మీకు దేహం అవసరం ఉందా, అవసరం ఉంటే వచ్చేస్తుంది, అవసరం లేకపోతే రాదు. బుద్ధుడికి పునర్జన్మ రావటానికి అవకాశం లేదు. వాడికి ఏ కోరికలు లేవు. మరల నేను శరీరంతో వచ్చి మంచిపనులు చేసి అహంకారాన్ని గ్లోరిఫై చేసుకోవాలి అని వాడు అనుకోవటంలేదు ఎందుచేతనంటే అక్కడ వ్యక్తిభావన లేదు.

ఎవడికి జ్ఞానం కలుగుతుంది అంటే శరీరం ఉండగానే చనిపోయి మరల అదే శరీరంలో ఎవడైతే తిరిగి పుడతాడో వాడికి ఆత్మజ్ఞానం కలుగుతుంది. బుద్ధుడికి ఫాల్స్ఐ పోయింది. ఏ శరీరంలో ఉండగా ఫాల్స్ఐ పోయిందో అదే శరీరంలో ఒక యూనివర్సల్ ఐ, ట్రూత్ ఆయనకు నేనుగా స్ఫురించింది. బుద్ధ బికేమ్ యూనివర్సల్. బుద్ధుడికి బలహీనతలు ఏమీ లేవు. కిరసనాయిల్ దీపంలో కిరసనాయిల్ అయిపోయింది అనుకోండి దీపం ఆరిపోతుంది. అలాగ బుద్ధుడికి పునర్జన్మలు ఆగిపోయినాయి. అంతేగాని నాకు పునర్జన్మలు ఆగిపోవాలి అని అక్కడ కోరిక ఏమీ లేదు. లోపల బోడీ బౌండ్ ఐ ఎండిపోయి రాలిపోయింది, నిర్వాణస్థితిని పొందాడు. హి బికేమ్ బుద్ధ. మాకు బుద్ధుడు అవ్వాలని ఉంది అంటే మరి కంపేషన్. కంపేషన్ ఈజ్ ద మదర్ ఆఫ్ ఆల్ బుద్ధాస్. కోపం వచ్చినప్పుడు మనకు చెడ్డమాటలు వచ్చేస్తాయి. అందుచేత కోపం వచ్చినప్పుడు కొంతసేపు మాట్లాడకుండా ఉండటం మంచిది. మీకు ఎప్పుడైనా మీ భర్తమీద కోపం వస్తే నువ్వు, నువ్వు అనేస్తారు. అంటే అలా అనాలని అనరు కోపంలో అలా వచ్చేస్తుంది. అందుచేత బుద్ధుడు ఏమన్నాడంటే అది అగ్ని అన్నాడు. అహంకారంలోనుండి,

బలంలోనుండి, దర్పంలోనుండి, కామంలోనుండి, క్రోధంలోనుండి విడుదల పొందండి. మనం ఎవరి ఇంటికి అయినా వెళ్ళామనుకోండి. అది మనం టీ తాగే టైము అనుకోండి, వారు టీ ఇస్తాము అంటే వద్దు అని అనకూడదు. అంటే మనకు అవసరమయినది తీసుకోవచ్చు, అవసరం లేనిది అక్కరలేదు అని చెప్పవచ్చు. మీకు ఎవరైనా ఇస్తూంటే అది అవసరం అయితే తీసుకోవచ్చు. అవసరం లేకపోతే నో అని చెప్పవచ్చు. అక్కడ దర్పం అక్కరలేదు. తర్వాత ఇంకోటి మీకు ఎవరైనా ప్రేమతో రవికలగుడ్డ యిస్తున్నారనుకోండి, మాకు రవికలగుడ్డలు ఉన్నాయి అనకూడదు. రవికలగుడ్డ మొఖం ఎప్పడూ పూర్వం చూడనట్టు అంత ప్రేమగా దానిని తీసుకోవాలి అంతేగాని ప్రేమతో ఇచ్చేటప్పడు ఆ వస్తువును రిజక్టు చేయవద్దు. అలా రిజక్టు చేయటం అది అహంకారంలోనికి వస్తుంది.

మనిషిని బంధించేవి నేను, నాది అనే తలంపులు. బుద్ధుడు రాజ్యాన్ని విడిచిపెట్టి బయటకు వచ్చాక నేను రాజ్యాన్ని విడిచిపెట్టాను అని ఎప్పడూ అనుకోలేదు. ఎవరైనా భిక్షకు పిలిస్తే భోజనానికి వెళుతున్నారు నేను పేదవాడినయిపోయానని మీకు అనిపించటం లేదా అని బుద్ధుడిని అడిగారు. రాజ్యం ఉన్నప్పడు నేను రిచ్‌మేన్‌ను అనుకోలేదు, ఇప్పడు రాజ్యం లేదు కాబట్టి పూర్‌మేన్‌ను అనుకోవటం లేదు. నేను ధనవంతుడిని అనుకోవటం ఒక తలంపు, నేను పేదవాడిని అనుకోవటం ఒక తలంపు. మా ఇంటిలో అందరూ బాగానే ఉన్నారు, అందరి పనీ బాగానే ఉంది అనుకోవటం ఇవన్నీ తలంపులు. ఒకవేళ అందరూ బాగుంటే బాగా ఉండనివ్వండి. ఇలా రిపీటెడ్‌గా అనుకోవటం వలన నీ మనస్సు పొల్యూట్ అయిపోతుంది. శరీరం మరణించాక పాడైపోయిన మనస్సు నీ కూడా వస్తుంది. అందుచేత అలా అనుకోవద్దు. పిల్లల పట్ల మీ డ్యూటీ ఏదో మీరు చేయండి అంతేగాని మమకారం పెట్టుకోవద్దు. ఎవరూ ఎవరికీ ఏమీ కారు. నేను, నాది అనే పదాలను సాధ్యమైనంతవరకు తక్కువగా వాడండి. నేను, నాది అనే తలంపులను నెమ్మదిగా, స్టడీగా తగ్గించుకొంటూ వస్తే అవి సన్నగిల్లి నశిస్తాయి, అప్పడు బ్రహ్మంలో ఐక్యమవుతారు.

అరుణాచలదీపం మనకు నేర్పేది ఏమిటి అంటే చీకటి పోవాలి అంటే వెలుతురు రావాలి. ఆ వెలుతురుకే దీపం గుర్తు. దీపం లేకుండా వెలుతురు రాదు. ఒక గదిలో వంద సంవత్సరాల నుండి చీకటి ఉన్నా దీపం వెలిగిస్తే ఆ చీకటి వెంటనే పోతుంది. నేను వంద సంవత్సరాలనుండి ఉన్నాను, ఎక్కడికీ వెళ్ళను అని చీకటి అనదు. దీపం వెలిగిస్తే వెంటనే చీకటి పోతుంది. అలాగే మనలో ఎన్ని జన్మలనుండి అజ్ఞానం ఉన్నా, భగవంతుడి దయ వలన మనకు జ్ఞానం వస్తే మనలో ఉన్న అజ్ఞానం, భవిష్యత్ జన్మలలో మనం అనుభవించ వలసిన కర్మ అంతా కూడా వెంటనే కాలి బూడిద అయిపోతుంది. అది జ్ఞానదీపం యొక్క మహిమ. జ్ఞానదీపానికి గుర్తుగానే ఈ భౌతికమైన దీపాన్ని ఇక్కడ ప్రజ్వలన చేస్తున్నారు.

## సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహభాషణములు

డిసెంబర్ 19 జిన్నూరు శ్రీ రమణ క్షేత్రం -
భగవాన్ శ్రీ రమణ మహర్షి 134వ జయంతి

With malice to none, Charity even unasked, and help to all creatures in thought, word and deeds, is the pious nature of good men, always.

**- Mahabharatha**

# జీవితాలలో జీవం సద్గురు శ్రీ రమణుడు

ప్రతి సంవత్సరం మాదిరిగానే ది. 19-12-2013న పరమ గురువు భగవాన్ శ్రీ రమణ మహర్షి జయంతి జరుపుకోబోతున్నాం! తిరుచ్చుళి గ్రామంలో అళగమ్మ, సుందరం అయ్యరు పుణ్యదంపతులకు వరప్రసాదంగా ఒక దేహం ధరించిన వేకట్రామన్ తన 15వ ఏట 'అరుణాచలం' పేరును బంధువు ద్వారా విన్నప్పుడు ఆయనకు ఒక అనిర్వచనీయమైన అలౌకికానందంలో ముంచివేసింది. అటుపిమ్మట వెంకట్రామన్ చదివిన 'పెరియపురాణం' అను గ్రంథం ఆయన జీవితాన్ని మలుపు తిప్పింది. తరువాత 16-07-1896న భగవాన్ జీవితంలో అద్భుతమైన సంఘటన జరిగింది. మధురైలో మేడమీద గదిలో ఉండగా మృత్యు అనుభవం ద్వారా అమృతస్థితి కలిగింది. తరువాత వారి ఉపాధి సెప్టెంబరు ఒకటి 1896న, అరుణాచలం చేర్చబడింది. అప్పటినుండి ఏబది నాలుగు సంవత్సరములు అరుణాచలం కేంద్రంగా, జీవన్ముక్తునిగా మానవాళికి తమ బోధను, అనుగ్రహాన్ని అందించారు. నీవెవరివో? తెలుసుకో! అనగా దేహం జీవించి యుండగానే దేహాత్మబుద్ధి నుండి విడదులపొంది, స్వరూప సచ్చిదానంద స్థితిని తానుగా అనుభవైకవేద్యం చేసుకోవాలన్నదే వారి ఉపదేశ సారం. మానవులు అమృతానుభవం పొందడానికే మానవజన్మ ప్రసాదింపబడినదని చేప్పేవారు. భగవాన్ రమణుడంటే చిదాకాశం. జీవులను జనన మరణ సంసారం నుండి ఉద్ధరించి, స్వరూప అమృత స్థితిలోకి మేల్కొలుపుటకు వచ్చిన గురుమూర్తి రమణుడు. భగవాన్ జ్ఞానభాస్కరుడు, అనగా సూర్యుడు కేవలం తన ఉనికి చేత సమస్త జగత్తుకు కాంతిని, జీవాన్ని ప్రసాదించునట్లు, భగవాన్ సమక్షము పరమశాంతిని ప్రసాదించేది. వారి ప్రతి మాట, చేత, చూపు దివ్యానుగ్రహమే! భగవాన్ నోటినుండి జాలువారిన ప్రతిమాట మన అహంకారము పట్ల బ్రహ్మాస్త్రంగా పనిచేస్తుంది. అహంకారము యొక్క ఉక్కు పిడికిలిలో నలిగి, తత్ఫలితంగా దుఃఖము, అశాంతి, పునర్జన్మలకు లోనవుతూ, గమ్యం తెలియక సతమతమయ్యే మానవాళిని స్వరూప అమృతస్థితిలోనికి మేల్కొలపడానికి మహాత్ములు ఆయాకాలాలలో భూమిపై అవతరిస్తూనే ఉంటారు. అట్టి మహాత్ముడే అరుణాచల ఋషి భగవాన్ శ్రీ రమణమహర్షి.

**- చావలి సూర్యనారాయణమూర్తి, అమలాపురం**

# మన ఆశే - మన బంధము

కోరిక ప్రస్తుతంలో ఉండనియ్యదు. అది భవిష్యత్తులోనికి మనలను ప్రేరేపిస్తుంది. అది మనలను అటు-ఇటూ తిప్పుతూ ఉంటుంది. స్థిరంగా ఉండనియ్యదు. మన అన్ని నమ్మకాలు అపనమ్మకాలే. బుద్ధునితో ఒకరు "స్వామీ ఈ ప్రపంచంలో ఇంత వేదన, ఇంత అశాంతి, ఇంత బంధంగా ఉంది ఏమిటి?" అనగా "నేను ఉన్న స్థితికిరా! ఏ దుఃఖము ఇక్కడ లేదు, ఏ వేదనా ఇక్కడ లేదు" అన్నారు. అందుకనే "ఆశలేని వాని ముందు పాలసముద్రము, లక్ష్మీదేవి వెలవెలబోతుంది" అంటారు. మనస్సు సంశయాల పుట్ట. ఒకటి తీరగానే రెండవది పుట్టుకొస్తుంది. "మాయలుప్తమైన స్థితిలోనే ఆత్మ దేవుడు ముఖాముఖి ప్రత్యక్షమౌతాడు అంటారు అనుభవజ్ఞులు. ఆశ కోరిక అరికట్టటానికి గురునామస్మరణ సహకరిస్తుంది. మనం పరిణితి పొందలేదు కాబట్టి ఎక్కువ ఆశలు, భంగపాటు, ఆందోళనలు, వ్యధలతో ఉండిపోతున్నాము. నరకాన్ని సృష్టించుకొంటున్నాము. రామాయణం "మనస్సును జయిస్తే ప్రపంచాన్ని జయించినట్లే" అంది. విషయాలు మన అధీనంలో ఉండాలి కాని వాటి అధీనంలో మనం ఉండకూడదు. సామాన్య మానవుని ఆలోచనాశక్తి తొంభై వంతులు వ్యర్థమైపోతున్నాయి అందుచేతనే నిరంతరం తప్పులు జరిగిపోతాయి. ఆశలేని మనస్సు తప్పులు చెయ్యదు. జీవితం గురించి మన దృక్పథం ఇలా ఉంటుంది. మంచి ఇల్లు, మంచి బట్టలు, మంచి భోజనం, మంచి వైజ్ఞానిక సంస్కృతి వీటిని మనం పరమార్ధంగా భావిస్తాము. ఈ ఇచ్ఛకు స్వతంత్రత ఉండనేరదు. అది ప్రారబ్ధాన్ని బట్టి సంప్రాప్తమౌతాయి. మన ఆశ అబద్ధం. దాని మూలాధారమైన వస్తువు నిత్యముక్తము. స్వార్థచింతన, యాజమాన్య ప్రవృత్తి, నేను, నాది అను భావాలు పోయిన తరువాత ఆత్మార్పణం చేసిన పిదప అహంకారం నశించిన పిమ్మట మన బంధాలు ఆశలు తొలగితే మిగిలేది దేవుడే. మనం ఎప్పుడూ ఏదో ఒకటి అతిగా కోరుకొంటాము. అదే బంధము. దానివల్లనే మనశ్శాంతి కోల్పోతాము. అభిమానికి, లోభికి మనశ్శాంతి లభించదు. నిజమైన మనశ్శాంతి ఇంద్రియాలను జయించటం వల్లనే లభిస్తుంది. ప్రకృతి సుఖాన్ని కోరేవాడు హృదయం శాంతిగా ఉండదు. ఎవరు అంతర్ముఖుడో భక్తిమంతుడో ఆతడే శాంతిని పొందుతాడు. దురాశతో ఎవడు పశుకర్మ చేస్తాడో వాడు పశువుగా పుడతాడు. మళయాళస్వామి ఆశ్రమ నిర్మాణంలో ఎడ్లు, సిమ్మెంట్, ఇనుమును మెరకపైకి బండిలాగుతూ అలసిపోతూ ఉంటే ఒకరు ఆ సంఘటనను స్వామి దృష్టికి తీసుకొని వస్తే 'గత జన్మలో వాళ్ళు మనుషులే కాని పనులు చేసి ఎడ్లుగా పుట్టారు' అన్నారు. కాబట్టి మన దురాశే మన దుఃఖం అవుతుంది. ఆశను వదలటమే పరమసుఖం. భగవంతుడు మనకు సంప్రాప్తింపచేసిన సంపదతో సంతృప్తిగా భావించి జీవితాన్ని సాగించిన వాడే నిజమైన పరమసుఖాన్ని అనుభవిస్తాడు. శ్రీనాన్నగారు "నీకు కనీస అవసరం లేకపోతే భక్తులను అడుగు ప్రకృతి మనుషులను అడిగితే హేళన చేస్తారు" అన్నారు. "ప్రపన్నుడిని దైవం ఎన్నడూ విడిచిపెట్టదు" ఇది సత్యవాక్కు.

- సాగిరాజు రామకృష్ణంరాజు, అర్ధవరం